# స్వఅర్ధం ...స్వధర్మం కథ



యఱ్ఱమిల్లి శ్రీకాంత్

<u>ముందు మాట</u>

ఈ కథ ఇంతకుముందు ఎక్కడా ప్రచురితం కాలేదు. ఇందులోని పాత్రలు,సందర్భాలు, కేవలం నా కల్పితం. ఎవరినీ ఉద్దేశించినవి కావు. ఇండియన్ ఫిలాసఫీ ఆధారితంగా భారతీయ చారిత్రక, పురాణ విషయాలను , మన నాగరికతనూ కథల రూపంలో రచించిన డాక్టర్ . రాహుల్ సాంకృత్యాయన్ వంటి మహారచయితల ప్రేరణతో నేను రచించిన కథాసంకలనంలోని నా కల్పిత సందర్భం ఈ కథ.



# స్వ అర్ధం ... స్వ ధర్మం కథ

మానవ నాగరికత ఎంతో అద్భుతంగా ఎదుగుతూ.. వేదశాస్త్రాలు, సమాజ సమానత్వం, కర్మాధిష్ట సాంఘిక వ్యవస్థలతో విలసిల్లుతున్న రోజులవి. సుమారు క్రీ.పూ .7000 సం || క్రితం ఆర్యావర్తాన్ని మొత్తాన్ని తదాధారిత ద్వీపాలను ఏక ఛత్రాధిపత్యంగా " రాజే మా తండ్రి ... మా ఇలవేల్పు" అని ప్రజలు కొలిచేలా పరిపాలిస్తున్నాడు విపేశ్వతుడు అనే మహారాజు.

'6' దర్శనాలలోను, 64 కళలలోనూ, ప్రేమ లోనూ, విద్య వ్యాపార, ఆరోగ్య,వ్యవసాయ, యుద్ధ శాస్త్రాలలో మహా పండితుడు ఆయన .ఎప్పుడూ విజ్ఞాన, వ్యవహారిక , శాస్త్రీయ పండితులతో ధర్మాధర్మ విశ్లేషణలతో, చర్చలతో, తీర్పులతో ఆయనకు ఆయనే సాటిగా పాలించేవారు . ఆయన ఒక విజ్ఞాన పిపాసి. గత 7 సం|| లు దూర దేశాలకు వెళ్లి అక్కడి విజ్ఞానాన్ని, విద్యనూ అభ్యసించి తిరిగి వచ్చారు. ఆకాలంలో తన రాజ్యాన్ని తన ఏడుగురు కొడుకులకు అప్ప చెప్పి వెళ్లారు ఆయన.

7 సం|| కాలంలో తనులేని రాజ్యం,తన ప్రజలూ ఏ విధంగా వున్నారో , వారి యోగక్షేమాలు తెలుసుకుందామని వేగులను నలుచరగులకు పంపించారు. వేగులు ఎంతో ఆనందోత్సాహాలతో తిరిగి వచ్చారు, "విపేశ్వతుని రాజకీయ, రాజ్యాంగ విధానాలు ప్రామాణికాలు, పరమోత్తమాలు " అని అందరూ పొగిడారు.

" మహారాజ !! ప్రజలు రాజ్యంలో ఎంతో సుభీక్షంగా ఎప్పటిలానే వున్నారు ,పంట దిగుబడి అద్భుతం, ధాన్యాగారాలలో కొదవలేదు. సమాన సమాజంలో ఎవరికి వచ్చిన.. నచ్చిన.. పనులు వారుచేయడం వల్ల ఎవరికీ బాధలు లేవు. ప్రజలందరూ సోదర సోదరీ భావాలతో ఒక కుటుంబంలా బ్రతుకుతున్నారు " అన్నారు ఒక వేగు.

“సకాలంలో వర్షాలు ,ఆరోగ్యవంతంగా ఎప్పుడూ ఎడతెగక పారే మన సరస్వతీ నది, సశ్యశ్యామలమైన పంటలు ,నిండుగా అడవులు, జీవ జాతులు.. ప్రభు ! ” అన్నాడు ఇంకొక వేగు.

ఈలోగా మంత్రి కలుగచేసుకొని " మీ ప్రామాణికాలు తిరుగులేనివి ఆర్యా.. శాంతి , ప్రేమ మేళవించిన మీ పరిపాలనకు శత్రువైనా స్నేహితుడిగా మారవలసిందే" అన్నారు.

ఇలా తను వచ్చిన వెంటనే అటు ప్రజలు.. ఇటు వేగులు.. ఇంకా తన కొడుకులు.. మంత్రులూ అందరూ చెప్పిన మంచి మాటలకు పరమానంద భరితుడైనాడు విపేశ్వతుడు. ఈ ఆనందాన్ని నేరుగా ప్రజలు అనుభవిస్తుండగా చూడాలని అనిపించి ఒక రాత్రి మారువేషంలో ఒక  సామాన్యుడిలాగా నగర వీధులలో బయలుదేరాడు ఆయన.

ఎక్కడ చూసినా ఆనందం ,సంతోషం .అందరూ తనకు వర్ణించిన దానికన్నా ఎక్కువే చూశాడు విపేశ్వతుడు. అలా ఒకానొక సందర్భంలో ఒక ఇంటి దగ్గర నుంచుని గమనిస్తున్న విపేశ్వతుడిని చూసి ఆ గృహిణి "ఎవరు బాబు నువ్వు?! మా ఇంటి ముందు ఈ వేళ నుంచున్నావు ? ! ”  అని .. లోపలి నుంచి అడిగింది. దొంగ అని ఆ గృహిణి భ్రమపడుతుందేమోనని తలచిన విపేశ్వతుడు...

"అమ్మా నేను యాచకుడను. ఏదైనా వుంటే పెట్టవూ కొంచెం ! " అని అడిగాడు. వెంటనే ఆ గృహిణి పళ్ళెం నిండా వండిన ఆహారము, మంచి పళ్ళు తెచ్చి వేసింది. ఆమె దయకు సంతుష్టుడైన విపేశ్వతుడు, "అమ్మా కొంచెం ఆహారం అడిగితే ఎంతో దయతో ఇవన్నీ పెడుతున్నావు. నీకు ధన ,కనక, వస్తు ,వాహనాలు.. మీ కుటుంబానికి అభివృద్ధి... ఆరోగ్యం లభించు గాక." అని ఆశీర్వదించి వెనుతిరిగాడు. దానికి ఆ గృహిణి యధాలాపంగా " మీ దయ స్వామి, అయినా నాకు ఇవేమీ అఖర్లేదు ! నేనూ, నా కుటుంబం చల్లగా వుంటే చాలు " అని, లోనికి వెళ్ళిపోయింది.

ఇవన్ని మారువేషాలలో రాజు పరివారులు సైనికులు గమనించి చిరునవ్వుతో రాజుతో ఇంకో వీధికి బయలు దేరారు. కాని ,విపేశ్వతుడు మనసులో ఆ క్షణంలో మెరుపులా ఒక విషయం స్పురణకు వచ్చింది.

" అంటే! రాజ్యం.. ప్రజలు.. అందరినీ ముందుకు నడిపించేది నేను బాగుండాలి.. నేనే!! బాగుండాలి అనే ఈ స్వార్ధపు ఆలోచన అన్నమాట !! అసలే మా ఈ ప్రజలు ఇప్పుడే మహాప్రళయం నుండీ బయటపడి నవ నాగరికతతొ అభివృద్ధి చెందుతున్న ఈ సమయంలో.. చిన్నమొక్కలా వున్న స్వార్థం అనే ఈ భావనను మొక్కలోనే రూపుమాపాలి, లేదంటే.. ఇది

విషంలా సమాజమంతా పాకి నాశనం చేస్తుంది." అని అనుకున్నాడు.తను గ్రహించిన ఈ విషయం వల్ల విపేశ్వతుడికి రాత్రంతా నిద్ర లేదు. ఎన్నో ఆలోచనలు, ఎంతో ఆందోళన చివరకి స్వార్ధం రూపుమాపడానికి నిర్ణయించుకున్నాడు.

ఆ పైన రాజశాసనం జారీ చేశాడు. తన రాజ్యంలో "ఎవరైనా ఎక్కడైనా స్వార్ధంతో వ్యవహరించినా వారిని కఠినంగా శిక్షిస్తాను" అని దండోరా వేయించాడు. ధర్మ గంటను ఒకటి పెట్టించి ,న్యాయమూర్తులను ఇందుకు నియమించాడు. దేశం నలుమూలలకూ వేగులను పంపి గమనించమని నియమించాడు. దేశంలో గాని, తన కోటలో తనవారు గాని, ఇంకా అడవులలో జంతుజాతులు, ఎవరైనా చివరకి తను కూడా స్వార్ధంతో వున్నట్టు ద్రుష్టికి వస్తే  ఎవరైనా శిక్షార్హులే ! అని తీర్మానించాడు.

సర్వ శాస్త్రాలు, పురాణాలు అన్నీ తెలిసి తప్పు అనేది చేయని ఆ ప్రేమమూర్తి మీద ఎదురు కూడా ఎవ్వరూ చెప్పలేక పోయారు. ఎందుకంటే విపేశ్వతుడు తప్పు చేయడు అని లోకోక్తి కనుక. అదే అందరి నమ్మకం కూడా.

కానీ.. క్రమేపి రాజ్యంలో సుఖ శాంతులు క్షీణించడం మొదలుపెట్టాయి. అన్నదమ్ములు.. అక్కచెల్లెళ్ళు.. తండ్రి మీద కొడుకులు.. కొడుకు మీద తల్లిదండ్రులు.. పిల్లలు ఒకరి మీద ఒకరు.. ప్రక్క వారి మీద.. అడవిలో జంతువుల మీద పల్లెవారు .. చివరకు భగవంతుని మీద కూడా కొందరు 'స్వార్ధం' అభియోగం వేసి రాజు దగ్గరకు తీసుకువెళ్ళసాగారు. వివేశ్వతుడు నివ్వెరపోయినా.. తను చేసిన చట్టం పూర్తి న్యాయబద్ధమైనది.. సహేతు బద్ధమైనది అని భావించి ఆ పరిష్కారంలో తలమునకలు కాసాగాడు, ఇలా కొన్ని రోజులు గడిచాయి.

ఒకానొక రోజున ఉదయం ఎప్పటిలాగే విశాలమైన కోట గుమ్మం దగ్గర వివేశ్వతుడు అమర్చిన ధర్మగంట మ్రోగడం మొదలు పెట్టింది. రాజు నియమించిన ధర్మమూర్తులు అభియోగం వివరించమని ఆ గంట కొట్టినవాడిని అడిగారు. అతనొక వృద్ధుడు. తేజస్సుతో వెలిగిపోతున్న ,ఆ 80 సం॥ వృద్ధుడు చూడడానికి మహాజ్ఞానిలా కనబడుతున్నాడు. "చెప్పండి ఆర్యా మీ అభియోగం ఎవరిమీద ?" అడిగారు న్యాయమూర్తి . అందుకు ఆ వృద్ధుడు "నా అభియోగం మహారాజు మీద" అన్నాడు గంభీరంగా, అందుకు ఆ న్యాయమూర్తి నవ్వుతూ "ఆర్యా మీరు పొరబడుతున్నట్లున్నారు ... చిన్న తప్పు కూడా చేయని మహాజ్ఞాని మన మహారాజు. అందుకే తన చట్టంలో

తనను తానే ముందు చెప్పుకున్నారు, స్వార్ధం లేకుండా నడచుకుంటున్నారు. వారు మీ పట్ల ఎలా స్వార్ధంతో  ప్రవర్తించివుంటారు?!!" అందుకు ఆ వృద్ధుడు ఆ సమాధానం ,నా అభియోగం రెండూ ఆయనకే వివరిస్తా , నన్ను ఆయనను కలవనివ్వండి " అని అడిగాడు. సైనికుల ద్వారా ఆ వృద్ధుడిని విపేశ్వేతుని ఆస్థానంలో ప్రవేశపెట్టారు.

"మహారాజా నా అభియోగం మీ మీదే, మీరు చేస్తున్నది తప్పు, స్వార్ధపూరితమైన పని. అది నేను నిరూపించగలను. దానికి మీరు నాతో ఈ రోజు వేటకు రావలసి వుంటుంది " అని అడిగాడావృద్ధుడు.

అందుకు మంత్రులు వారించగా, విపేశ్వేతుడు "ప్రాణం మీద మమకారం కూడా స్వార్ధం ... అది నాకు లేదు. ఆయన మీ రాజును ఏదో చేస్తారు అనుకోవడం మీ స్వార్ధం , అది మాకు వద్దు ... నన్ను వెళ్ళ నివ్వండి ." అని చెప్పి అడవికి బయలుదేరాడు.

ఇద్దరూ ప్రయాణించి అడవి మధ్యకు చేరుకున్నారు. అలా చుట్టూ తిరిగి చూసి ఆ వృద్ధుడు.....

"మహారాజా ... అదిగో ఆ దూరాన్న కనిపిస్తున్న జింకల గుంపు నీరు త్రాగుతోంది ఆ సరస్సులో చూశారా ? అక్కడ ఒక సింహం పొంచివుంది గమనిచండి " అని అడిగాడు. వెంటనే విపేశ్వతుడు తన విల్లు ఎక్కు పెడుతూ ...ఎక్కడ? అని తీక్షణంగా చూస్తూ బాణం సంధించ ప్రయత్నించాడు, అందుకు ఆ వృద్ధుడు "ఆగండి మహారాజా ఎందుకు ఆ సింహం మీదకు బాణం సంధిస్తున్నారు ?" అని అడిగాడు. అందుకు విపేశ్వతుడు "అది క్రూర మృగం ... ముఖ్యంగా అది కేవలం దాని పొట్ట గురించి తప్ప ఆలోచించని పరమ స్వార్ధపూరిత జంతువు  కనుక విల్లును సంధించాను !" అన్నాడు స్పష్టంగా.

"సరే అయితే ఆ సింహాన్ని చూసి తన ప్రాణాల కోసం పరుగుతీస్తున్న జింక గూడా స్వార్ధపు జీవేకదా మరి ? దాని మీదకుడా సంధించండి మీ బాణం! అన్నాడు వృద్ధుడు వ్యంగ్యంగా.

ఒక్క క్షణం ఆలోచించిన విపేశ్వతుడు "నిజమే అదే నా స్వార్ధం నిర్వచనంకుడా... అప్పుడు ఆ రెండు జంతువులూ శిక్షార్హులే. రెంటినీ శిక్షిద్దాం..." అన్నాడు  రాజు పూర్తి గంభీరంగా.

ఈ సంభాషణ జరుగుతుండగా , అకస్మాత్తుగా అటు నుంచి ఇటు పరుగెత్తిన జింకను, తరుముతున్న సింహం ....వీరిని చూసి అమాంతంగా ఆ ప్రక్కనున్న గుట్టమీదకెక్కి గట్టిగా అరచి ... ఇద్దరినీ చూసి కాలు దువ్వుతూ లంఘించబోయింది.

విపేశ్వతుడు సింహం కళ్ళలోనికి చూస్తూ ...తన ఆయుధాలను వదిలేసి నిర్లిప్తంగా ఉండిపోయాడు ...ఇదే అదనుగా ఆ సింహం ఒక్కసారిగా విపేశ్వతుని మీదకు ఉరికింది. అది గమనించిన ఆ వృద్ధుడు లిప్త పాటులో,కింద పడివున్న రాజు బల్లేన్ని సింహంమీదకు దునిమాడు . భయంతో సింహం ఒక్క అరుపు అరచి వెను తిరిగి పారిపోయింది.

తరువాత వృద్ధుడు...విపేశ్వతునితో , "మహారాజా !!!! ఏమిటి మీరు చేసిన పని ? ఎందుకని ఏమీ చేయకుండా కావాలని ఆలా వుండిపోయారు ??! అని అడిగాడు.

అందుకు విపేశ్వతుడు ,"యోగీశ్వరా మీరెవరో నాకు తెలియదు ...!!! కాని నేను 14 సం|| నుంచి సంఖ్య , యోగ , వైసేషిక , న్యాయ , మీమాంస , వేదాంత శాస్త్రాలను అధ్యయనం చేస్తున్నాను. నేను అలా తెలుసుకున్న విషయాల ద్వారా, వచ్చిన నమ్మకంతో చెప్తున్నా , ఈ సందర్భంలో నేను చేసిన స్వార్ధ రహిత సమాజ సిద్ధాంతానికి , శాసనానికి కట్టుబడి ఉన్నవాడినైతే ,ఇప్పుడు ఆ సింహానికి తల వంచడమే సమంజసం ." అని గట్టిగా... నమ్మకంగా చెప్తాను .....ఇంకా చెప్పాలంటే ప్రాణాన్ని కాపాడుకోవాలి అన్న ఆలోచన కూడా స్వార్ధభరితమే కదా ? మరి ఆ రెండు జంతువులను ( సింహం, జింక ) స్వార్ధం అని శిక్షించ తలచిన నాకు కుడా అదే సిద్ధాంతం వర్తిస్తుంది కదా!? ఇది కూడా తెలియదా మీకు !!?? " ప్రశ్నించాడు విపేశ్వతుడు అందుకు తదేకంగా చూస్తూ ఆ వృద్ధుడు ఒక చిరునవ్వు నవ్వి మహా రాజా! మీరు బ్రహ్మ వరప్రసాది, జ్ఞాన సంపన్నులు.. కాదనను .మీరు ఇప్పుడు చెప్పిన దానిని కూడా కాదనను కాని అందులోనే వున్న ఒక్క సూక్ష్మ ధర్మాన్ని మీరు గమనించ లేకపోతున్నారు.

"ప్రాణాల మీద మమకారము.. స్వార్ధమే అని అభివర్ణించిన మీరు... నమ్మిన సిద్ధాంతానికి ,మీది కాని , కేవలం మీ వల్ల మాత్రం కలగని మీ ప్రాణాలను త్యజించే హక్కు మీకేవరిచ్చారు ???!!! ఇది స్వార్ధం కాదా??? "అని అడిగాడు

వృద్ధుడు. అసలు ఆత్మ రక్షణకు ప్రయత్నం చేయకపోవడం ఆత్మ హత్యే కదా !?

"అప్పుడు ఆత్మ హత్య నేరం కాదా??

ఈ విశ్వంలో కారణంతో ,ఆలోచనతో జరిగే ఏ విషయమైనా స్వార్ధ ప్రతిభింబమే అవుతుంది కదా ?

అలాగే అకారణంగా జరిగే ఏ సంఘటనైనా నిస్వార్ధ భరితమే .!!"

" మనుషులలో.. అన్ని జీవ రాసులలో వుండే ఆకలి, నిద్ర, సృష్టి, ప్రేమ.. అన్నీ స్వార్ధ రూపాలే కాని అవి రాసులు పోసినట్టు విడి విడిగా వుండవు. వారి వారి సందర్భాన్ని బట్టి.. సంస్కారాలను బట్టి ఎర్పడిన పరిస్థితులవల్ల, తలెత్తిన అవసరాలద్వారా మారుతూ వుంటాయి.. అని గ్రహించండి.

" స్వార్ధం మీకు రాజ్యంలో ఎక్కువగా కనబడకూడదు, అన్న మీ ఆలోచన ఆశయం గొప్పదే. ఇప్పుడిప్పుడే మనం మహా ప్రళయం నుంచి బయట పడి, నాగరికత వైపు అడుగులు వేస్తున్నాము. అందుకు స్వార్ధం ప్రతిబంధకము కాకూడదు కానీ.. పూర్తిగా స్వార్ధం నశించాలి అని కోరుకోవటం వినాశనానికి అంకురం వేసినట్లే.

ఎందుకంటే స్వార్ధం లేకపోతే ప్రేమ లేదు. "మీ ప్రజలలో స్వార్ధం ,నేను, నాది అన్న పరిధి.. పెరుగుతూ అందరినీ, అన్నిటినీ కలుపుకుంటూ వెళ్ళాలి అని కోరుకోవాలి మీరు" అంతే కాని నేను సైతం అంటూ స్వార్ధం అంతరించాలి అని

రాజే అనుకుంటే.. రాజ్యం బలహీనపడుతుంది, దోపిడీలపాలవుతుంది, దండయాత్రలు.. వినాశనానికి మీరే దారిచూపినట్లవుతుంది. అసలు సర్వేజనా *సుఖినో భవంతూ* అని నేరుగా నిర్వచించడం తప్పేమో!! అనిపిస్తుంది కొన్ని సందర్భాలలో.

భుక్తికి వేటాడటం సింహం ధర్మం. ప్రాణాలు కాపాడు కోవటం జింక ధర్మం . మరి స్వార్ధం తప్పు అంటే!! జింక ఆత్మార్పణ చెయాలి లేదా సింహం ఆకలితో మరణించాలి కదా ?! అలా కాక ఎవరి కనీస ధర్మాన్ని వారు కాపాడుకునే ప్రయత్నమే ఈ జగన్నాటకం. అటువంటి 'స్వధర్మం' మీదే సృష్టి నడుస్తుంది.

అసలు ఈ 'స్వ' అనేది ఒక బ్రహ్మ పదార్ధం... దానిని నిర్వచించడమే మనషులుగా మన తప్పు, పైగా దానికి ప్రామాణికాలను పెట్టడం... అధీనంలోనికి తీసుకోవాలనుకోవడం వంటివి ప్రాణికోటికి.. ముఖ్యంగా మనషులకు హక్కు లేదు.. వీలు లేదు. అది గ్రహించండి మహా రాజా. స్వార్ధం లేకపోతే కోరిక లేదు, ప్రయత్నం లేదు, అభివృద్ధి లేదు అందుకే ,

|| వినా స్వార్థః వినా విశ్వాహః ||

అని చెప్పిన ఆ వృద్ధుడి మాటలకు నిశ్చేష్టుడైన విపేశ్వతునికి అప్రయత్నంగా కళ్ళ వెంట ధారగా కన్నీరు ఒలికింది. ధర్మ సూక్ష్మాన్ని.. యుగ ధర్మాన్ని

క్లుప్తంగా విశదీకరించిన ఆ మహానుభావునికి చేతులు జోడించి నమస్కరించాడు.

ఈ లోగా ఆ వృద్ధుడు ."సరే ప్రభు మరి సాయంత్రం అవుతోంది. ఇక బయలు దేరుదాం. మీరు ఇందాకా వదిలిన ఆయుధాలను తీసుకోండి అన్నాడు చిరునవ్వుతో, విపేశ్వతుడు ఆయుధాలను తీసుకుని అడవి నుండి రాజ్యానికి భయలుదేరాడు. కొంత దూరము ప్రయాణించిన తరువాత పెను తిరిగి చూడగా, ఇంత వరకూ తనతోవున్న వృద్ధుడు కనపడలేదు.

అంతర్థానమైన ఆయనకు సాక్షాత్తు 'అంతర్యామి'గా భావించిన రాజు తనకు విశదమైన ధర్మ సూక్ష్మాలను నెమరు వేసుకుంటూ రాజ్యానికి బయలుదేరాడు.